
మా "కృష్ణ"కి అభినందనలు
మాకు అత్యంత ఆత్మీయులు, సన్నిహితులు, మా శ్రేయోభిలాషి, యంగ్ & డైనమిక్ లీడర్
నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలు గారు
తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ పార్టీ నేతగా నియమితులైన శుభసందర్భంగా వారికి
మా హృదయపూర్వక అభినందనలు
నాయుడు రమేష్ (కావూరు)
రామ్‌శ్రీ హోమ్స్, చిలకలూరిపేట
డా॥ వున్నం నాగమల్లిఖార్జునరావు
M.S Ortho
వున్నం హాస్పిటల్స్, పిడుగురాళ్ళ
బద్దుల రామారావు (రాము)
నరసరావుపేట
అత్తోట రామ నరసింహారావు
పిడుగురాళ్ళ

డీజీపీని కలసిన ఎంపీ రాయలు


డీజీపీతో ఎంపీ లావు, మక్కెన, జిలాని

నరసరావుపేట, జూన్ 29: రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును టీడీపీ పార్లమెంటరీ పార్టీనేత లావు శ్రీకృష్ణ దేవరాయలు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో ద్వారకా తిరుమలరావుని కలసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పల్నాడులోని ముఖ్యమైన అంశాలపై చర్చించారు. ఎంపీ వెంట మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, నరసరావుపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ సయ్యద్ జిలాని ఉన్నారు

ప్రభుత్వాస్పత్రిలో నిర్మాణాలపై.. విజిలెన్స్ విచారణ


ప్రభుత్వ ఆస్పత్రిలో పర్యటిస్తున్న పెమ్మసాని, నసీర్ అహ్మద్, రామాంజనేయులు, కలెక్టర్

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆదేశాలు
- ఏళ్ల తరబడి నిర్మాణాలు జరగడం పట్ల విస్మయం
- శాసన సభ్యులతో కలసి జీజీహెచ్‌లో తనిఖీలు

గుంటూరు (మెడికల్), జూన్ 29: 'గుంటూరు ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో జరుగుతున్న భవన నిర్మాణాల కాంట్రాక్ట్‌లపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖతో విచారణ జరిపించి ఏ స్థాయిలో తప్పు జరిగినా వెలికి తీయాలని' కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కలెక్టర్ నాగలక్ష్మీ సెల్వరాజన్‌ను ఆదేశించారు. శనివారం ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ నాగలక్ష్మీ సెల్వరాజన్, శాసన సభ్యులు మహ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణకుమార్‌లతో కలసి ఆయన పర్యటించారు. పలు వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో గత ఏడేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన విజిటర్స్ వెయిటింగ్ హాల్‌ను పరిశీలించిన మంత్రి పెమ్మసాని, ఇన్నేళ్లుగా ఆ భవన నిర్మాణం పూర్తి కాకపోవడం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. అప్పటి డీపీఆర్‌లకు అనువుగా నిధులు విడుదలైనా ఇప్పటికీ పనులు పూర్తి కాకపోవడం ఏమిటని? సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్‌ను నిలదీశారు. దీనికి సరైన సమాధానం ఇవ్వలేకపోవడంతో ..ఈ నిర్మాణాల కాంట్రాక్టర్‌పై విజిలెన్స్ విచారణ జరపాలని మంత్రి పెమ్మసాని ఆదేశించారు. తప్పు చేసింది నిజమైతే కఠిన చర్యలు తీసుకోవాలని, ఏ స్థాయిలో తప్పు జరిగిందో వెలికి తీయాలని ఆయన స్పష్టం చేశారు. త్వరలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీని ఏర్పాటు చేయాలని సొసైటీ ఛైర్‌పర్సన్, కలెక్టర్ నాగలక్ష్మీకి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు.

ప్రభుత్వ వైద్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలి...

గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలని పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. ఆసుపత్రిలో అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారం కోసం స్థానిక శాసనసభ్యులను సమన్వయం చేసుకొని ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఆయన ప్రకటించారు అనంతరం నాట్కో కేన్సర్ విభాగంలోని సెమినార్ హాల్‌లో వైద్యాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి సంబంధించిన ప్రాథమిక వివరాలు, వైద్య విభాగాలు, రోగులకు అందిస్తున్న సేవలు, మౌలిక సౌకర్యాలు, అభివృద్ధి పనులు, జింకానా, నాట్కో ట్రస్ట్ ద్వారా అందిస్తున్న వైద్యసేవలు, విభాగాలవారీగా పరిష్కరించాల్సిన సమస్యలను సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ తెలిపారు. సంబంధి వైద్య విభాగాధిపతులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పెమ్మసానికి వివరించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ సీటీ స్కాన్ మెషిన్‌కు సంబంధిత ఏజెన్సీ ద్వారా తక్షణం మరమత్తులు చేయించాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు నసీర్‌అహ్మద్, గల్లా మాధవి, రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్ పలు అంశాలపై సూచనలు అందిస్తూ కేంద్రీకృతంగా ఉన్న వైద్య పరికరాలు, ఇతర సేవల నిర్వహణను వికేంద్రీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి, ఆర్‌డీ సీహెచ్ సుధారాణి, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ బీ సతీష్ కుమార్, ఏపీ ఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీధర్, అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు, జింకానా కోఆర్డినేటర్లు డాక్టర్ బాలభాస్కరరావు, డాక్టర్ పీవీ హనుమంతరావు, నాట్కో ట్రస్ట్ కోఆర్డినేటర్ అశోక్‌కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బియ్యం బకాసురుల బండారం త్వరలోనే బట్టబయలు

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జూన్ 29: రాష్ట్రంలో పేదల బియ్యం బొక్కేసి అడ్డదారుల్లో వేలకోట్లకు పడగలెత్తిన వైసీపీ బియ్యం బకాసురులందరి బండారం త్వరలోనే బట్టబయలు కావటం ఖాయమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. కొద్దిరోజులుగా పౌరసరఫరాలశాఖలో వెలుగుచూస్తున్న విస్తుపోయే వాస్తవాల నేపథ్యంలో శనివారం విడుదలచేసిన పత్రికాప్రకటనలో గడిచిన ఐదేళ్లలో ప్రతి నియోజకవర్గంలో చోటుచేసుకున్న రేషన్‌బియ్యం అక్రమాలన్నీ తవ్వితీయాల్సిన సమయం వచ్చిందన్నారు. కాకినాడ పోర్టు ద్వారా ఏఏ దేశాలకు ఎంతెంత దొంగతనంగా ఎగుమతులు చేశారు?, ఆ బియ్యం ఏఏ ప్రాంతాల నుంచి అక్కడికి ఎలా చేర్చారో మొత్తం వెలికి తీస్తే సగంమంది వైసీపీ నేతలు ఊచలు లెక్కపెట్టడం ఖాయమన్నారు. మాజీ మంత్రి విడదల రజినిపై కూడా ఇదే విషయంలో తీవ్ర ఆరోపణలు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. పేదల బియ్యాన్ని దారి మళ్లించి మిల్లుల ద్వారా వేలకోట్లు వెనకేసుకున్న పెత్తందారులు, వారికి వెన్నుదన్నుగా నిలిచినవారిని చట్టం ముందు నిలబెట్టాల్సి ఉందన్నారు. చెప్పినమాట ప్రకారం తొలి ఐదు సంతకాల్లోనే పింఛన్ల పెంపునకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబును పేదలంతా గుండెల్లో పెట్టుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రం ఆర్థికకష్టాల్లో ఉండి ప్రతి నెల వందల కోట్ల భారం పడుతున్నా ఇచ్చినమాట ప్రకారం పింఛన్‌ను రూ.4వేలు చేసిన నిజమైన చాంపియన్ చంద్రబాబు అని ప్రత్తి పాటి కొనియాడారు.

గుంటూరు - బెంగళూరు ఇంటర్‌సిటీకి పెమ్మసాని ప్రతిపాదన

- విశాఖ - ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ గుంటూరుకు వచ్చే అవకాశం
- రైల్వే జీఎం నుంచి బోర్డుకు వెళ్లిన ప్రతిపాదనలు

గుంటూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నిత్యం పగటిపూట ఒక ఇంటర్‌సిటీ రైలుని గుంటూరు-బెంగళూరు- గుంటూరు మధ్యన నడపాలని కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసా ని చంద్రశేఖర్ ప్రతిపాదించారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా ప్రజలకు బెంగళూరు వెళ్లేందుకు ఉదయం ఎలాంటి రైలు సదుపాయం అందుబాటులో లేదు. దీనికి సంబంధించిన ప్రతి పాదన దక్షిణమధ్య రైల్వేజోన్ నుంచి కేంద్ర రైల్వేబోర్డుకు వెళ్లిం ది. ఈ ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపితే త్వరలోనే బెంగ ళూరుకు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు సదుపాయం ఇక్కడి ప్ర యాణీకులకు అందుబాటులోకి వస్తుంది. అమరావతి రాజధా ని నగరాన్ని గుంటూరు జిల్లా కలిగివున్న దృష్ట్యా ఏపీ, కర్ణాటక క్యాపిటల్స్ మధ్యన ఈ రైలు ప్రయాణిస్తుంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీ ర్లు చాలామంది బెంగళూరు పరిసరాల్లో విధులు నిర్వహిస్తున్నా రు. త్వరలోనే అమరావతి రాజధానిలోనూ సాఫ్ట్‌వేర్ పరిశ్రమ విస్తరించనుంది. ఈ నేపథ్యంలో గుంటూరు-బెంగళూరు ఇంటర్ సిటీరైలుకు ఆక్యుపెన్సీ బావుంటుందనే అభిప్రాయం వ్యక్తమౌ తోంది. ప్రస్తుతం విశాఖపట్టణం-ఎల్‌టీటీ(ముంబై) మధ్యన నిత్యం రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్‌ని గుంటూరు మీదగా మళ్లించా లని కొన్నినెలలుగా రైల్వే వినియోగదారులు కోరుతున్నారు. ఈ రైలు ప్రస్తుతం విజయవాడ నుంచి కాజీపేట మార్గంలో సికింద్రాబాద్‌కు చేరుకొంటుంది. కేవలం కాజీపేట రైల్వేస్టేషన్‌లో మాత్రమే నిలుపుదల సౌకర్యం ఉన్నది. మరోవైపు కాజీపేటకు ఎల్‌టీటీ వెళ్లే రైళ్లు మరికొన్ని ఉన్నాయి. ఈ నేపథ్యంలో గుంటూరు మీదగా ఎల్‌టీటీ రైలుని మళ్లిస్తే గుంటూరు, పల్నాడు, నల్గొండ జిల్లాల ప్రయాణీకులకు ఎంతో మేలు జరుగుతుంది. దీనిని పరిగణనలోకి తీసుకొన్న రైల్వే శాఖ ఈ రైలుని గుంటూరు మీదగా నడిపేందుకు ప్రతిపాదించింది. ఈ విషయాన్ని కూడా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళితే కొద్ది రోజుల్లోనే ముంబైకి డైలీ రైలు సదుపాయం అందుబాటులోకి వస్తుంది.



ఆర్కిటెక్చర్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజీనామా చేయాలి

- టీఎన్ఎస్ఎఫ్ నాయకుల డిమాండ్


ఆర్కిటెక్చర్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

పెదకాకాని, జూన్ 29: ఏఎన్‌యూలో ఆర్కిటెక్చర్ కాలేజి ప్రిన్సిపల్ ఈదర శ్రీనివాస రెడ్డి ప్రభుత్వం మారినా తన తీరు మార్చుకోకుండా వైసీపీ నాయకుడు వలే ప్రవర్తిస్తున్నారని టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బత్తుల హేమంత్ ఆరోపించారు. శనివారం వర్సిటీలో ఆయన ప్రిన్సిపాల్‌ని కలిసి ఉద్యోగానికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో వైసీపీ అనుకూలంగా ఓటు వేయమని విద్యార్థులకు తరగతి గదుల్లో బోధించారని ఆరోపించారు. ఇంజనీరింగ్ కళాశాల పేరు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలగా మారటానికి ప్రధమపాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కొర్రపాటి అభిషేక్, హరీష్, ఎస్డీ గౌస్ యశ్వంత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో అక్రమాలపై సీఐడీ విచారణ జరపాలి

- టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు జి.భాగ్యరాజు

పెదకాకాని, జూన్ 29: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గత ఐదేళ్లుగా జరిగిన అక్రమాలపై సీఐడీ విచారణ జరిపించాలని వర్సిటీ టీఎన్ఎస్ఎఫ్ నాయకులు జి.భాగ్యరాజు డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని కలిసి వర్సిటీ పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా భాగ్యరాజు మాట్లాడుతూ వీసీ రాజశేఖర్‌పై చక్రపాణి కమిటీ విచారణ జరుగుతుందన్నారు. అయినా నిబంధనలకి విరుద్ధంగా సజ్జల రామకృష్ణారెడ్డి ఆయనకు వీసీ పదవిని కట్టబెట్టారని తెలిపారు. వీసీ రాజశేఖర్, సజ్జల కలసి యూనివర్సిటీ నిధులలో రూ.కోట్లల్లో అక్రమాలు చేశారన్నారు యూనివర్సిటీ బడ్జెట్ మీద విచారణ జరిపి ప్రొఫెసర్ నాగరాజు, మధుబా బు, ఉదయకుమార్‌లపై కూడా ఏపీ సీఐడీచే విచారణ జరిపించాలని భాగ్యరాజు కోరారు.

కమిషనర్ భార్య.. ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం

- సామాన్యులకు ఆదర్శం... కమిషనర్‌ను అభినందించిన ప్రజానీకం


ఏరియా వైద్యశాలలో భార్య, బిడ్డతో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్

బాపట్ల, జూన్ 29: ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో కేవలం పేదప్రజలే వైద్యసేవలు పొందుతారనేది నానుడి. ఎంతోకొంత ఆర్థికస్థోమత ఉన్నవారంతా ప్రైవేటు వైద్యశాలల్లోనే చికిత్స పొందటానికి ఇష్టపడుతుంటారు. ఇవన్నీ కాదంటూ అందరికీ ప్రభుత్వవైద్యశాలలో మంచి వైద్యం అందుతుందని బాపట్ల మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ తన భార్యకు ఏరియావైద్యశాలలో కాన్పుచేయించి ఆదర్శంగా నిలిచారు. ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ పర్యవేక్షణలో వైద్యులు డాక్టర్ విజయలక్ష్మి సిబ్బందితో కలిసి కమిషనర్ భార్యకు కాన్పు చేశారు. ప్రభుత్వ వైద్యశాల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించేలా కమిషనర్ అనుసరించిన విధానాన్ని అందరు హర్షిస్తున్నారు.


అమరావతికి రండి

- నేపాల్ మాజీ ప్రధానికి జాస్తి ఆహ్వానం


నేపాల్ మాజీ ప్రధాని లోకేంద్ర బహదూర్ చంద్‌కు ఫోటోని బహూకరిస్తున్న డాక్టర్ జాస్తి

గుంటూరు సిటీ, జూన్ 29: బౌద్ధ మత ఆనవాళ్లతో విలసిల్లుతున్న అమరావతికి రావాలంటూ నేపాల్ మాజీ ప్రధానమంత్రి లోకేంద్ర బహదూర్ చంద్‌ను అఖిల భారత పంచాయతీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్య క్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఆహ్వానించారు. శనివారం నేపాల్ రాజధాని ఖాట్మండులో బహదూర్‌చంద్‌తో భేటీ అయిన ఆయన నాలుగోసారి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు అమరావతి నిర్మాణం కోసం చేస్తున్న కృషిని వివరించారు. చంద్రబాబునాయుడు సంకల్పం నెరవేరి అమరావతి దేవతలు కొలువుండే రాజధానిగా విలసిల్లుతుందని ఈ సందర్భం గా నేపాల్ మాజీ ప్రధానమంత్రి ఆకాంక్షించారని జాస్తి ప్రకటనలో తెలిపారు. నేపాల్ మాజీ ప్రధాని, ఆయన సతీమణి ఆర్ట్ ఫోటోని బహూకరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


సూరె ముక్కంటి (ఫైల్‌ఫొటో)


రాజుపాలెం, జూన్ 29: విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని ఉప్పలపాడు గ్రామశివారు చల్లపల్లి తండాలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని ఇనిమెట్ల గ్రామానికి చెందిన సూరె ముక్కంటి(42) తాపీమేస్త్రిగా జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే చల్లపల్లి తండాలో ఓ ఇంటి నిర్మాణ నిమిత్తం పరంజా కడుతున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు పైనున్న విద్యుత్ వైరు తగిలింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన ముక్కంటిని చికిత్స నిమిత్తం ఆటోలో హాస్పటల్‌కు తీసుకువెళ్లారు. మార్గమధ్యంలోనే ప్రాణాలుపోయినట్లు చెబుతున్నారు. మృతునికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు.

కుడికాలువలో జారిపడి వ్యక్తి మృతి


శ్రీనివాసరావు మృతదేహం

మాచర్ల రూరల్, జూన్ 29: ప్రమాదవశాత్తూ కుడి కాలువలో జారిపడి వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం జరిగింది. బెల్లంకొండ మండలం వన్నాయపాలెంకు చెందిన గడ్డం శ్రీనివాసరావు(40) మాచర్ల మండలం కొప్పునూరులోని తన మామ చీరబోయిన మల్లయ్య ఇంటి వద్ద పదినెలలుగా ఉంటున్నాడు. నాలుగు నెలలుగా అదే గ్రామానికి చెందిన గన్నెబోయిన శ్రీను వద్ద జీవాలను మేపేందుకు జీతానికి కుదిరాడు. శుక్రవారం మధ్యాహ్నం జీవాలను కుడి కాలువ వద్ద కడుగుతూ ప్రమాదవశాత్తూ కాలు జారి కాలువలో కొట్టుకుపోయాడు. మృతుని భార్య గోవిందమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం శ్రీనివాసరావు మృతదేహాన్ని కుడికాలువ నుంచి బయటకు తీశారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య


గుర్తు తెలియని మృతదేహం

మాచర్ల రూరల్, జూన్ 29: గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మాచర్ల మండలం విజయపురిసౌత్ కొత్త బ్రిడ్జి వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నాగార్జున సాగర్ బోర్డర్ చెక్‌పోస్టు నుంచి తెలంగాణకు వెళ్లే దారిలోని విజయపురిసౌత్ కొత్త బ్రిడ్జి వద్ద శనివారం పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో బ్రిడ్జి నుంచి దూకి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు బావిస్తున్నారు. మృతుని వయసు సుమారు 65 సంవత్సరాలుగా దాకా ఉంటుంది. ఒంటిపై లైట్ గ్రీన్ కలర్ గీతలు గల టీషర్ట్, బ్లూ కలర్ గీతలు గల లుంగీ ధరించి ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భాష్యం ప్రవీణ్, కొమ్మాలపాటి శ్రీధర్ భేటీ


కొమ్మాలపాటితో ఎమ్మెల్యే ప్రవీణ్

గుంటూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో శనివారం భేటీ అయ్యారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించుకున్నారు. ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అవిశ్రాంతంగా పని చేసినవారిని గుర్తుపెట్టుకొని వారికి అవసరమైన సహకారం అందించాలని, సీనియర్లకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని ప్రవీణ్‌కు శ్రీధర్ సూచించారు. కొందరు రెండు పడవల పై కాళ్లపెట్టిన రీతిలో వ్యవహరించారని అలాంటివారిని పార్టీకి దూరంగా ఉంచాలని సూచించారు. చిన్నవయసులో ప్రతిష్టాత్మకమైన విజయం సాధించే అవకాశం దక్కిందని, ప్రజల మన్ననలు పొందేలా ముందుకు సాగాలని ప్రవీణ్‌కు కొమ్మాలపాటి సలహా ఇచ్చారు.

నిరుద్యోగ యువతకు డేటా ఎంట్రీలో శిక్షణ

గుంటూరు(విద్య), జూన్ 29: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. పొన్నూరు నియోజకవర్గంలోని గవర్నమెంట్ డిగ్రి కాలేజీ, చేబ్రోలులోని స్కిల్‌హబ్ నందు డొమెస్టిక్ డేటాఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఇందులో మూడు నెలలపాటు యువతకి నైపుణ్య శిక్షణ కల్పించివారిని స్థానికంగా జిల్లాలోవున్న పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇంటర్ లేదా ఆపైన విద్యార్హతలున్నవారు జులై 3 లోపు స్కిల్‌హబ్‌నందు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9666545975 నందు సంప్రదించాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

దేవదాయం.. దోపిడీ

- అడ్డగోలు ఉత్తర్వులతో జీతాలు
- అర్హత లేకపోయినా కీలక బాధ్యతలు
- సొంతవారికి ఇష్టారీతిన ఉద్యోగోన్నతులు
- అవుట్‌సోర్సింగ్ నియామకాలతో వసూళ్లు





గుంటూరులోని దేవదాయ శాఖ కార్యాలయం

ఆధ్యాత్మకంగా ఉంటూ.. హిందూ ధర్మ ప్రచారంతో పాటు.. ఆలయాల అభివృద్ధి.. భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన.. దేవదాయశాఖ అధికారులు కొందరు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. దేవదాయ శాఖను దోపిడీకి కేంద్రంగా మార్చుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో సొంత అజెండాతో ప్రభుత్వం చెలరేగగా.. తామేమీ తీసిపోమన్నట్లుగా దేవదాయశాఖలోని కొందరు అధికారులు అదేబాట పట్టారు. అడ్డగోలు ఉత్తర్వులు.. ఇష్టం వచ్చిన ట్లు నిధులు డ్రా.. ఒక పద్ధతి లేకుండా ఉద్యోగోన్నతులు.. అర్హత లేకపోయినా కీలక బాధ్యతలతో కొందరు అధికారులు దేవదాయ శాఖలో పెత్తనం సాగించారు. గడిచిన 5 ఏళ్లుగా గుంటూరు జిల్లా దేవదాయ శాఖలో కొందరు అధికారులు తిష్ట వేసి భారీగా అవినీతి అక్రమా లకు పాల్పడ్డారన్న ఆరోపణలు సొంతశాఖలోని ఉద్యో గుల నుంచి వెల్లు వెత్తుతున్నాయి. ఓ కీలక అధికారి తన అనుయాయులను వెంటేసుకుని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలో పెత్తనం చెలయిస్తూ ప్రతీ పనికి ఒక రేటు నిర్ణయించి అందని కాడికి దోచుకున్నారని సమాచారం.

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 29: అడ్డగోలు ఉద్యోగోన్నతులు, అక్రమాలకు గుంటూరు దేవదాయశాఖ కేంద్రంగా మా రింది. అసిస్టెంట్ కమిషనర్ క్యాడర్‌లో ఉన్న ఓ అధికారి ఉద్యో గోన్నతిపై విమర్శలున్నాయి. 2019లో వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత అక్రమ ఉద్యోగోన్నతులు జరిగాయి. అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న ఓ అధికారి ఎటువంటి అదనపు బాధ్యతలు లేకుండానే నేరుగా ఉద్యోగోన్నతి పొందారు. రాష్ట్ర స్థాయి అధికారులు అప్పట్లో ఇచ్చిన ఈ ఉత్తర్వులపై అభ్యంతరాలు వ్యక్తం చేసినా పట్టించుకునే వారు లేకుండా పోయారు. దీంతో కీలక పోస్టులోకి వెళ్లిన ఆ అధికారి ఐదేళ్లపాటు దేవదాయ శాఖను దోచుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అక్రమంగా బాధ్యతలు చేపట్టి ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలో అన్ని గ్రూపు దేవాలయాలపై పెత్తనం చేస్తూ పెద్దఎత్తున అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. తన అనుయాయుడైన ఓ అధికారిని కార్యాలయంలో కీలక పోస్టులో నియమించుకుని అడ్డగోలుగా దోచేశారని తెలిసింది. ట్రెజరీ నుంచి కూడా జీతాలు డ్రా చేశారన్న ఆరోపణలున్నాయి. కనీసం ట్రెజరీ అధికారులు కూడా ఈ విషయాన్ని గుర్తించకుండా జీతాలు కట్టబెట్టారని కొందరు ఉద్యోగులు తెలిపారు. అడ్డగోలుగా తాను కీలక బాధ్యతలు నిర్వహించడమే కాకుండా తన పరిధిలో ఉన్న అధికారం వినియోగించుకుని అనేక అక్రమాలకు పాల్పడ్డారన్న విమర్శలున్నాయి. ఉద్యోగోన్నతి పేరుతో గుంటూరు జిల్లాలో ఓ డివిజన్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి నుంచి రూ.2 లక్షలు తీసుకున్నట్లు సమాచారం. సీనియర్లను కాదని జూనియర్ అయిన మరో ఉద్యోగికి నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగోన్నతి కల్పించి రూ.3 లక్షల తీసుకున్నట్లు ఆరోపణన్నాయి. ఇలా దేవదాయశాఖ పరిధిలోని మూడు జిల్లాల్లో సుమారు 200 మంది ఉద్యోగులకు అక్రమంగా ఉద్యోగోన్నతులు ఇచ్చి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యేక సిబ్బంది కావాలంటూ అవుట్‌సోర్సింగ్ విధానంలో అనేకమందిని నియమించుకుని వారి వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇలా దేవదాయ శాఖలో ఐదేళ్లుగా ఆ అధికారి అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డారని ఆ శాఖ ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. తనిఖీల పేరుతో ప్రతీ ఆలయానికి వెళ్లడం రూ.వేలల్లో డిమాండ్ చేసి వసూలు చేయడం ఓ ఆనవాయితీగా ఆ అధికారి చేసుకున్నట్లు విమర్శలున్నాయి. ప్రతీ ఏడాది బడ్జెట్ ఆమోదించాల్సి ఉండగా దానికి కూడా ఓ రేటు పెట్టి.. ఆ ప్రకారం డబ్బులు వసూలు చేశారని తెలిసింది. దీంతో మూడు జిల్లాల్లోని ఆలయాల్లో పనిచేసే ఈవోలు, మేనేజర్లు బెంబేలెత్తి పోయారని తెలిసింది. ఎప్పుడు వచ్చి తమపై పడతారు.. ఎంత డిమాండ్ చేస్తారో అంటూ ఉద్యోగులు హడలెత్తేవారంటే ఆశ్చర్యం కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ అధికారి ఇటీవల వరకు చేసిన అక్రమాలు, అవినీతి తాజాగా వెలుగులోకి వస్తున్నాయి. అయితే ఆరు నెలల క్రితం జరిగిన బదిలీల్లో ఆ అధికారి తిరిగి పాత పోస్టులోనే వేరే జిల్లాకు వెళ్లారని సమాచారం.

పెనుమాక నుంచే.. పింఛన్ల పండుగ

- స్వయంగా హాజరు కానున్న సీఎం చంద్రబాబు
- రేపు ఉదయం 6 గంటలకు లబ్ధిదారులకు నేరుగా పంపిణీ
- అనంతరం గ్రామంలో లబ్ధిదారులతో చంద్రబాబు ముఖాముఖీ
- గ్రామంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి, అధికారులు



సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో చెప్పినట్లుగా కూటమి ప్రభుత్వం సామాజిక పింఛన్ల పంపిణీకి సిద్ధమైంది. పింఛన్ల పండుగను గుంటూరు జిల్లా నుంచే ప్రారంభించనున్నారు. ఇంటింటికీ రూ.7 వేలును నేరుగా లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగులు అందజే యాల ని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విష యం తెలిసిందే. ఈ క్రమంలో అమరావతి రాజ, దాని పరిధిలోని తాడేపల్లి మండలం పెనుమాక నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూలై 1వ తేదీ సోమవారం తెల తెలవారుతుండగానే సీఎం చంద్రబాబు స్వయంగా పెనుమాకలోని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేయను న్నారు. పింఛన్‌దారుల కళ్లల్లో ఆనందం స్వయంగా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి స్వయంగా ఒక గ్రామంలో సామాజిక పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటిసారి. పింఛన్ల పంపిణీని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌దారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. స్వయంగా ముఖ్యమంత్రి పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొంటారని తెలియడంతో గ్రామంలో సందడి నెలకొంది. అధికారులు, పోలీసులు బందో బస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం కలెక్టర్ నాగలక్ష్మి మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి తదితరులు గ్రామంలో చంద్రబాబు పింఛన్లు అందజేసే ప్రాంతాన్ని పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.



సీఎం రాక కోసం రహదారికి మరమ్మతులు

వైసీపీ మోసం.. చెప్పినట్లు చేస్తోన్న టీడీపీ

సార్వత్రిక ఎన్నికల్లో పింఛన్ల పెంపు హామీ ఒక గేమ్ ఛేంజర్‌గా మారింది. గత వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి రాకముందు పింఛన్‌ని రూ.3 వేలకు పెంచుతామని చెప్పి రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌దారులను మోసగించింది. ఏడాదికి రూ.250 చొప్పున పెంచడంతో అవి వారికి ఏమాత్రం అక్కరకు రాలేకపోయాయి. దాని వల్ల పింఛన్‌దారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తమని మోసగించిన జగన్‌కి తగిన బుద్ధి చెప్పేందుకు ఎప్పుడెప్పుడు అవకాశం వస్తుందా అని ఐదేళ్లు ఎదురు చూశారు. కాగా చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలలో భాగంగా పింఛన్‌ని రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తొలి నెల నుంచే పెంచిన పింఛన్ ఇస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పారు. ఎన్నికల సమయంలో పెన్షన్ల పంపిణీ సక్రమంగా చేయకుండా వైసీపీ ప్రభుత్వం చేసిన ఇబ్బందులు చూసి ఏప్రిల్ నెల నుంచే పింఛన్ పెంచుతానని, దానిని జూలై నెల ఒకటో తేదీన ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు ప్రస్తుత నెల రూ.4 వేలు, ఏప్రిల్ నుంచి రూ.వెయ్యి చొప్పున మూడు నెలలకు కలిపి రూ.3 వేలు మొత్తంగా రూ.7 వేలు పంపిణీకి చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆదేశాలు ఇచ్చారు. ఆ మేరకు శనివారం బ్యాంకుల నుంచి సచివాలయాల సిబ్బంది నగదు డ్రా చేశారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

పెనుమాకలో సోమవారం ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొంటున్నందున అధికారులందరూ సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో శనివారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ అనంతరం జరిగే ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు, ప్రజలతో చంద్రబాబు ముఖాముఖీ మాట్లాడతారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని, పారిశుధ్య ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జేసీ రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్, డీఆర్‌వో పెద్ది రోజ, గుంటూరు ఆర్‌డీవో పీ.శ్రీఖర్, పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్, సిపిఓ శేషశ్రీ, డిఈఓ శైలజ, డీఎస్‌వో కోమలి పద్మ పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చుల వివరాలను విధిగా అందించాలి

- కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్

నరసరావుపేట, జూన్ 29: ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఖర్చుల వివరాలను విధిగా అందజేయాలని కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్ తెలిపారు. కలెక్టరేట్‌లో అభ్యర్థులు, వారి ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో జిల్లా నుంచి 122 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేశారని, వీరిలో 89 మంది జమ ఖర్చుల పరిశీలన శనివారం నిర్వహిస్తుండగా మరో 33 మందికి సంబంధించిన వ్యయం వివరాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఎన్నికల వ్యయం వివరాలు అందించిన అభ్యర్థులు వ్యయ పరిశీలకుల నుంచి తగిన ధ్రువపత్రం స్వీకరించాలన్నారు. ఎన్నికల వ్యయం వివరాలను అందించని అభ్యర్థుల పేర్లను బ్లాక్ లిస్టులో ఉంచడం జరుగుతుందని ఇటువంటి వారికి తదుపరి రెండు ఎన్నికల్లో పోటీ చేసే అర్హత ఉండదని తెలిపారు. ఎన్నికల వ్యయ పరిశీలకులుగా జోసఫ్, సుమీత్ కుమార్, గౌతమన్ వ్యవహరిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్, వ్యయ పరిశీలకులు

వీవీ ప్యాడ్లలో పేపర్ రోల్ తొలగింపు ప్రక్రియ

నరసరావుపేట మార్కెట్ యార్డులో ఈవీఎం నిల్వ చేసిన గోదాములను కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వీవీ ప్యాడ్లలో ఉండే పేపర్ రోల్, అడ్రస్ సీల్‌ను తొలగించే ప్రక్రియను పరిశీలించారు. ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్, మాచర్ల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, నరసరావుపేట రిటర్నింగ్ అధికారి సరోజ, సత్తెనపల్లి నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి మురళీ కృష్ణ, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆందోళన.. వీసీ రాజీనామా

- ఛాంబర్‌కు తాళంతో దిగొచ్చిన రాజశేఖర్
- ఏఎన్‌యూలో ఐదేళ్ల అరాచక పాలనకు విముక్తి



వీసీ చాంబర్ ఎదుట ఆందోళన చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్, జనసేన విద్యార్థి సంఘాల నాయకులు

పెదకాకాని, జూన్ 29: వైసీపీతో అంటకాగి.. వైసీపీ సేవలో తరించి.. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీగా ఆచార్య రాజశేఖర్ తీరుపై విమర్శలు, ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో శనివారం టీఎన్ఎస్ఎఫ్, జనసేన విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఆయా విద్యార్థులు వర్సిటీలో ర్యాలీ చేసి అనంతరం వీసీ ఛాంబర్‌కు తాళాలు వేసి ధర్నా చేశాయి. రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాల వీసీలు రాజీనామా చేశారని, కానీ నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ మాత్రం రాజీనామా చేయలేదని మండిపడ్డారు. వర్సిటీలో పెద్దఎత్తున దోపిడీలు చేసి, వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన రాజశేఖర్‌కు వీసీగా కొనసాగే అర్హత లేదన్నారు. వీసీని చాంబర్‌కు రానిచ్చే ప్రసక్తే లేదని తెలిపారు. ఈ విషయం తెలిసిన వీసీ రాజశేఖర్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్‌కు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నిటీష్‌యాదవ్, నాయకులు భాగ్యరాజు, జనసేన అధ్యక్షుడు జగదీష్, నాయకులు శ్రీను, అవినాష్, రామకృష్ణ, యశ్వంత్, ఖాయూమ్, పవన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంగా వర్సిటీ

2019 సెప్టెంబరులో విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతిగా ఆచార్య రాజశేఖర్ నియమితులయ్యారు. 2022 సెప్టెంబరు 28 నుంచి రాజశేఖర్‌ను రెగ్యులర్ వీసీగా నియమించారు. ఈ క్రమంలో ఇన్‌చార్జి వీసీగా నియమితులైనప్పటి నుంచి ఆయన వైసీపీ ప్రభుత్వంతో అంటకాగి విశ్వవిద్యాలయాన్ని వైసీపీ కార్యాలయంగా మార్చారన్న విమర్శలున్నాయి. విద్యకు నిలయమైన విశ్వవిద్యాలయంలో అప్పటి సీఎం జగన్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిల పుట్టినరోజు నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ విగ్రహాన్ని తొలుతగా ఏఎన్‌ఎలో ఏర్పాటు చేసి విశ్వవిద్యాలయాల్లో రాజకీయ నాయకుల విగ్రహాల ఏర్పాటుకు నాంది పలికారనే విమర్శలు మూటగట్టుకున్నారు. తన అనుచరులందరికీ అతిధి అధ్యాపక ఉద్యోగాలతో పాటు ప్రోగ్రామర్ తదితర ఉద్యోగాలు ఇచ్చారనే ఆరోపణలున్నాయి. పాలకమండలి ఆమోదం లేకుండానే వర్సిటీ డిపాజిట్లు రూ.కోట్లలో దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. బూటకపు ఇంటర్వ్యూలు నిర్వహించి నలుగురు దళిత, బీసీ వర్గాలకు చెందిన అతిథి అధ్యాపకుల పొట్ట కొట్టారన్న విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వం ప్రకటించిన మూడు రాజధానులకు మద్దతుగా వర్సిటీలో వీసీ ప్రత్యేకంగా సదస్సులు, సెమినార్లు నిర్వహించారు. మూడు రాజధానులపై ఓ పుస్తకం కూడా ముద్రించారు. వైసీపీ ప్లీనరీ సమావేశాల సందర్భంగా వర్సిటీలో పరీక్షలను వాయిదా వేసి ప్రాంగణాన్ని వైసీపీ వారి వాహనాలకు పార్కింగ్ స్థలంగా ఇచ్చారు. ఈ క్రమంలో శనివారం ఆయన రాజీనామాతో వర్సిటీలో ఐదేళ్ల అరాచక పాలనకు ముగింపు పలికినట్లుగా విద్యార్థులు, అధ్యాపకులు భావిస్తున్నారు.

ఇళ్ల నిర్మాణం మొక్కుబడి



- నరసరావుపేటలో నిలిచిన గృహాలు

- పేదల ఇళ్ల నిర్మాణం 30.62 శాతమే
- ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంలో వైసీపీ ప్రభుత్వం విఫలం
- మౌలిక వసతల కల్పనలోనూ అలసత్వం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎంతో అర్భాటంగా చేపట్టిన పేదల ఇళ్ల నిర్మాణం పథకం చతికిల పడింది. ఇళ్లను పూర్తి చేయడంలో గత వైసీపీ ప్రభుత్వం ఆపసోపాలు పడింది. జిల్లాలో చేపట్టిన గృహాల్లో 30.62 శాతం మాత్రమే పూర్తయ్యాయి. వేలాది ఇళ్ల పునాదుల స్థాయి లోనే నిలిచిపోయాయి. కాలనీలకు మౌలిక వసతుల కల్పనను విస్మరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తుందని లబ్ధిదారులు ఆశపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 224 కాలనీల లేఅవుట్‌ను ఏర్పాటు చేశారు. వీటిలో 39,312 గృహాలు నిర్మించాలని లక్ష్యంగా నాటి ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటికి 12,224 గృహాల నిర్మాణం పూర్తయింది. 10,842 గృహాల నిర్మాణ పనులు ప్రారంభించి మమా అనిపించారు. ఈ ఇళ్ల పునాదుల దిగువ స్థాయిలో ఉన్నాయి. 10,672 గృహాలు నిర్మాణం పునాదుల స్థాయి దాటలేదు. పలు కాలనీల్లో పూర్తయిన ఇళ్ళల్లో నివాసం ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయి. మౌలిక వసతుల కల్పన జరగకపోవడం, ఊరికి దూరంగా ఇళ్ళు ఉండటంతో రవాణా సౌకర్యం లేకపోవడం తదతర అంశాలలో ఇళ్లల్లో నివాసం ఉండలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రహదారుల సౌకర్యం లేకపోవడం, కనీసం తాగునీరు కూడా అందుబాటులో లేకపోవడంతో పూర్తయిన గృహాల్లో నివాసం ఉండలేని దుస్థితి నెలకొంది. పూర్తయిన గృహాలకు కనీసం విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని, లేఅవుట్‌లకు ఉన్న ప్రధాన రహదారుల నిర్మాణాలను పూర్తి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నా వారి మొర అలకించే నాథుడే కరువయ్యాడు. కాలనీల్లో అంతర్గత రహదారులు, మురుగు కాలువలు నిర్మించే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. వర్షం కురిస్తే రహదారులు తటాకాలను తలపిస్తున్నాయి. మౌలిక వసతులు పూర్తి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నియోజకవర్గం	మంజూరైన ఇళ్లు	పూర్తైయిన ఇళ్లు
నరసరావుపేట	5,957	1,405
చిలకలూరిపేట	3,548	886
వినుకొండ	5,557	1,781
మాచర్ల	4,556	524
గురజాల	5,354	2,767
సత్తెనపల్లి	4,830	1,038
పెదకూరపాడు	9,490	2,853



నరసరావుపేటలో ప్రారంభం కాని ఇళ్ళ నిర్మాణాలు

- జిల్లా వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణం లక్ష్యం: 39,912
- పూర్తయిన ఇళ్లు : 12,224
- పునాదుల దిగువ స్థాయిలో : 10,842
- పునాదుల స్థాయిలో : 10,672
- పురోగతిలో ఉన్నవి 18,864

దిక్సూచి DIKSUCHI

అగ్రి డిప్లొమాలు



ఎన్‌జీ రంగా వర్సిటీ

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ అగ్రికల్చర్ విభాగాల్లో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ వ్యవధి మూడేళ్లు. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతోపాటు అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమాలు-సీట్లు

- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 578 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 1900 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 260 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 40 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 60 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 330 సీట్లు ఉన్నాయి.
- కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 75 శాతం సీట్లు, పట్టణ ప్రాంతాల్లో చదివినవారి కోసం 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత వివరాలు: ఆంధ్రప్రదేశ్/తెలంగాణ స్టేట్ బోర్డు లేదా సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్/టీఓఎస్ఎస్ నుంచి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/మధ్యలో ఆపేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు/ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్:** angrau.ac.in

డా.వైఎస్సార్ హెచ్‌యూ

పశ్చిమగోదావరి జిల్లా-వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(డా.వైఎస్సార్‌హెచ్‌యూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ, అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహించనున్నారు. డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో 528 సీట్లు, డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోగ్రామ్‌లో 22 సీట్లు చొప్పున మొత్తం 550 సీట్లు ఉన్నాయి. వీటిలో 75 శాతం సీట్లను గ్రామీణ విద్యార్థులకు, 25 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల వారికి కేటాయించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు. మిగిలిన 15 శాతం సీట్లకు దేశవ్యాప్తంగా అభ్యర్థులందరూ పోటీపడవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది.

డిప్లొమా ఇన్ హార్టికల్చర్ సీట్ల వివరాలు

ప్రభుత్వ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: డా.బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా-రామచంద్రాపురంలోని ఎస్‌కేపీపీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు, ఏలూరు జిల్లా-నూజివీడులోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, అన్నమయ్య జిల్లా-కలికిరిలోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, శ్రీ సత్యసాయి జిల్లా-మడకశిరలోని ఎస్ఎస్‌పీజీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా పది శాతం సీట్లు కేటాయించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: శ్రీకాకుళం జిల్లా-ఎస్వీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, మన్యం జిల్లా-ఎన్ఆర్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ఏలూరు జిల్లా-నోవా కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, పలనాడు జిల్లా-సాదినేని చౌదరయ్య హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ప్రకాశం జిల్లా-శ్రీ బెల్లంకొండ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, వైఎస్సార్ కడప జిల్లా-ఎస్‌బీవీఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, నంద్యాల జిల్లా-ఎస్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లలో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 280 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 28 సీట్లు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 308 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ సీట్ల వివరాలు: నంద్యాల జిల్లాలోని హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో 20 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 2 సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 22 సీట్లు ఉన్నాయి.

అర్హత: బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్వహించే పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. సీబీఎస్ఈ/ఎన్ఐఓఎస్/ఓఎస్ఎస్/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అర్హులే. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు, ఇంటర్ మధ్యలో ఆపేసిన/ఫెయిల్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు, ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు, కౌన్సెలింగ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 6
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

ఎఫ్‌సీఆర్ఐలో బీఎస్సీ ఆనర్స్ ఫారెస్ట్రీ

సిద్దిపేట జిల్లా ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఆర్ఐ) హైదరాబాద్- బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 55 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మేథమెటిక్స్ స్ట్రీమ్ అభ్యర్థులకు 25 శాతం, బయాలజీ స్ట్రీమ్ అభ్యర్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. టీజీ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్లు; దివ్యాంగులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 1
- **వెబ్‌సైట్:** www.fcrihyd.in/

ఇఫ్లూలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- ఇంగ్లీష్‌లో 160 గంటల ప్రొఫిషియెన్సీ కోర్సును నిర్వహిస్తోంది. అభ్యర్థులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సాధించేందుకు ఈ ప్రోగ్రామ్ ఉపకరిస్తుంది. హైదరాబాద్ క్యాంపస్‌లో మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ ఆగస్టులో ప్రారంభమౌతుంది.



కోర్సు వివరాలు

- ఇందులో బేసిక్, ఇంటర్మీడియట్, అడ్వాన్స్‌డ్ లెవెల్స్ ఉంటాయి. ప్లేస్‌మెంట్ టెస్ట్ ద్వారా లెవెల్ అడ్మిషన్ ఉంటుంది. కోర్సు వ్యవధి నాలుగు నెలలు. రోజుకు రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు తరగతులు నిర్వహిస్తారు. తరగతికి 30 నుంచి 35 మంది అభ్యర్థులు ఉంటారు. ఉదయం, సాయంత్రం బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉం టుంది. కనీసం 80 శాతం అటెండెన్స్ తప్పనిసరి.
- కోర్సులో భాగంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు సంబంధించి లిజెనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్, కమ్యూనికేషన్, గ్రామర్, ఒకాబులరీ అంశాల్లో శిక్షణ ఇస్తారు. వారానికి ఒకసారి ప్రొనౌన్సియేషన్ ప్రాక్టీస్ ఉంటుంది. రీసెర్చ్ స్కాలర్స్, టీచింగ్ అసిస్టెంట్లు క్లాస్‌రూం తరగతులు నిర్వహిస్తారు. వీటికి సంబంధించిన మెటీరియల్ ఫొటోకాపీ ఇస్తారు. డిజిటల్ ల్యాబ్స్ ఉంటాయి. అభ్యర్థుల నెలవారీ ప్రోగ్రెస్‌ను పరీక్షిస్తారు. కోర్సు చివరలో ఫైనల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణులైనవారికి మాత్రమే సర్టిఫికెట్‌లు ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైనవారు; సంస్థ నిర్వహించే 40 గంటల ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. విదేశీ విద్యార్థులు వీసా, రెసిడెన్స్ పర్మిట్ కాపీలు సబ్మిట్ చేయాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** జూలై 1
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

ఉస్మానియా యూనివర్సిటీలో వర్క్‌షాప్

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(డీఈఈ)- వారం రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోంది. దీని ప్రధానాంశం 'అప్లికేషన్స్ ఆఫ్ డిజిటల్ కంట్రోల్ ఇన్ పవర్ ఎలక్ట్రానిక్ కన్వర్టర్స్'. ఈ వర్క్‌షాప్‌ను ఆర్‌యూఎస్ఏ-2.0, వీఐ మైక్రో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు స్పాన్సర్ చేస్తున్నాయి. ఇందులో ఫండమెంటల్ అండ్ అడ్వాన్స్‌డ్ థియరిటికల్ కాన్సెప్ట్‌లు; మైక్రోకంట్రోలర్స్, డిజిటల్ సిగ్నల్ ప్రాసెసర్స్, ఫీల్డ్ ప్రోగ్రామబుల్ గేట్ యారేస్‌ల వినియోగం; ల్యాబొరేటరీ సెషన్స్ ఉంటాయి. సంబంధిత విభాగాలకు చెందిన రీసెర్చ్ స్కాలర్స్, ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్, ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి ఈ-మెయిల్ ద్వారా సమాచారమిస్తారు.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రీసెర్చ్ స్కాలర్స్‌కు రూ.2,500; ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులకు రూ.3,500; ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్‌కు రూ.4,500
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** జూన్ 30
- **వర్క్‌షాప్ వ్యవధి:** జూలై 8 నుంచి 13
- **వెబ్‌సైట్:** www.uceou.edu

హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్‌లో ఖాళీలు

జాబ్ కార్నర్

సికింద్రాబాద్‌లోని హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్...కాంట్రాక్ట్ ప్రాతిపదికన బీబీనగర్ ఎయిమ్స్(అమృత్ ఫార్మసీ ఔట్‌లెట్‌లు), తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది.

ఫార్మసిస్ట్: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణతతో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి

అసిస్టెంట్ ఫార్మసిస్ట్: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా **ఇంటర్వ్యూ తేదీలు:** జూలై 4

వెబ్‌సైట్: www.lifecarehll.com/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/soMebZfలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

ఫహాద్‌పై సుమోటో కేసు

మలయాళ నటుడు, నిర్మాత ఫహాద్ ఫాజిల్‌పై కేరళ మానవ హక్కుల సంఘం సుమోటో కేసు నమోదు చేసింది. దీనిక్కారణం ఆయన నిర్మిస్తున్న 'పింకేలీ' సినిమా షూటింగ్. అంగమలైలోని ఎర్నాకులం ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం రాత్రంతా ఈ సినిమా కోసం షూటింగు చేయడంతో



అక్కడున్న రోగులంతా ఇబ్బంది పడ్డారు. ఆస్పత్రి లోపలికి ఎవరినీ అనుమతించకుండా అత్యవసర విభాగం అనుమతి తీసుకోకుండా షూటింగ్ చేశారనేది ఆరోపణ. దీనిపై ఎర్నాకులం జిల్లా వైద్యాధికారి బీనా కుమారి సీరియస్ అయ్యారు. ఏడు రోజుల్లో ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న కేరళ మానవ హక్కుల సంఘం నిర్మాత ఫహాద్‌పై కేసు నమోదు చేసింది.


'హరిహర వీరమల్లు' వచ్చేది ఎప్పుడంటే

పవన్‌కల్యాణ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'హరిహరవీరమల్లు' మీదే ఇప్పుడందరి దృష్టి ఉంది. అగ్ర నిర్మాత ఏ.ఎం.రత్నం నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం చాలా కాలంగా నిర్మాణంలో ఉంది. ఈ సినిమా విడుదల ఎప్పుడా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. హీరో పవన్‌కల్యాణ్ రాజకీయాలతో బిజీ కావడం వల్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ శాసన సభకు జరిగిన ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ గెలిచి, ఉప



ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి, బిజీగా ఉండడంతో ఆయన ఆర్టిస్టుగా తిరిగి సెట్‌లోకి అడుగు పెట్టడానికి మరింత ఆలస్యం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటువంటి నేపథ్యంలో 'హరిహర వీరమల్లు' చిత్రం గురించి అప్‌డేట్ ఇచ్చారు నిర్మాత ఎ.ఎం.రత్నం. 'సినిమాలో పవన్‌కల్యాణ్ వర్క్ దాదాపు పూర్తయింది. మరో 20-25 రోజులు ఆయన కేటాయిస్తే షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ప్రస్తుతం పవన్‌కు ఉన్న బిజీ షెడ్యూల్ ను దృష్టిలో పెట్టుకుని షూటింగ్ ప్లాన్ చేస్తాం. మా సినిమా స్ట్రీమింగ్ రైట్స్ అమెజాన్‌కు ఇచ్చాం. వారితో చేసుకున్న ఒప్పందం ప్రకారం అక్టోబరులో సినిమాను విడుదల చేయాలి. అయితే ఇంకాస్త సమయం కావాలని వాళ్లను అడుగుతాం. డిసెంబర్ నాటికి విడుదల చేయడానికి ప్రయత్నిస్తాం. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది' అని చెప్పారు. సినిమా ఆలస్యం అవుతున్న కారణంగా 'హరిహర వీరమల్లు' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న క్రిష్ తప్పుకోవడంతో జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు.

గతంతో ముడిపడిన కథ



విజయ్‌ఆంటోని నటిస్తున్న చిత్రం 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్‌బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. శనివారం సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న హీరో గతమేంటి అనే ఆలోచనను ప్రేక్షకుల్లో రేకెత్తించారు. ఇది హీరో గతంతో ముడిపడిన కథ అని ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సంగీతం: అచ్చు రాజమణి, విజయ్ ఆంటోని.



ప్రముఖ నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ త్వరలోనే ప్రియుడు నికోలయ్ సచ్‌దేవ్‌తో ఏడడుగులు వేయనున్నారు. ప్రస్తుతం ఆమె పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. సినీ, రాజకీయ ప్రముఖులను కలసి ఆహ్వాన పత్రికలు పంచుతున్నారు. శనివారం వరలక్ష్మి కుటుంబ సమేతంగా ప్రధాని మోదీని కలిశారు. తమ వివాహ కార్యక్రమానికి హాజరయ్యి ఆశీస్సులు అందించాలని కోరారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసి, ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.

స్టార్‌డమ్ పేరుతో బందీ కాలేను



తమన్నా

దక్షిణాదిన అగ్ర హీరోలందరి సరసన కథానాయికగా అలరించిన తమన్నా ఇప్పుడు ప్రత్యేక గీతాల్లోనూ ఆడి పాడుతున్నారు. అలాగే ఓటీటీలో వెబ్ సిరీస్‌లు చేస్తున్నారు. నెగెటివ్ పాత్రలకు సైతం సై అంటున్నారు. దీంతో హీరోయిన్‌గా స్టార్‌డమ్ తగ్గడంతోనే తమన్నా ఐటమ్ సాంగ్స్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే తమన్నా మాత్రం వాటిని కొట్టిపారేస్తున్నారు. ఎప్పుడూ ఒకే తరహా పాత్రలు చేయడం తన వల్ల కాదన్నారు. అందుకే కొత్త తరహా పాత్రలు ప్రయత్నిస్తున్నానని చెప్పారు. కరోనా తర్వాత ప్రేక్షకుల అభిరుచిలో వచ్చిన మార్పుకు అనుగుణంగా కథలు, పాత్రలు ఎంచుకుంటున్నానని తెలిపారు. "మేస్ట్రో' చిత్రంలో నెగెటివ్ రోల్ చేశాను. ఆ పాత్ర బాగా పండింది. ఆ తర్వాత అలాంటి అవకాశాలు మరిన్ని నన్ను వెతుక్కుంటూ వచ్చాయి. కానీ వాటికి నో చెప్పాను. ఇప్పుడు నటిగా నాలోనూ పరిణతి వచ్చింది. స్టార్‌డమ్ పేరుతో బందీగా ఉండలేను. హీరోకు జోడీగా నటించడం అనేది నాకున్న ఎంపికల్లో ఒకటి మాత్రమే అని గుర్తుంచుకోవాలి. వెబ్ సిరీస్‌లు చేసినా, ప్రత్యేక గీతాల్లో నర్తించినా ప్రేక్షకులకు ఇంకా ఏదో కొత్తదనం అందించాలనేదే నా ప్రయత్నం' అని తమన్నా అన్నారు.

'కూర్మావతారం' ఆధారంగా...



వరలక్ష్మీ శరత్‌కుమార్, సాయికుమార్, శివాజీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కూర్మనాయకి'. హర్షవర్ధన్ కడియాల దర్శకత్వంలో కె.విజితా రావు నిర్మిస్తున్నారు. శనివారం శివాజీ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఓ స్పెషల్ వీడియోను రిలీజ్ చేసింది. మహావిష్ణు అవతారాల్లోని 'కూర్మావతారం' ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం త్వరలోనే విడుదలవుతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: చోటా.కె.ప్రసాద్, సినిమాటోగ్రఫీ: రామ్, సంగీతం: శేఖర్‌చంద్ర.



'జై బోలో తెలంగాణా, హితుడు' లాంటి పలు తెలుగు చిత్రాల్లో కథానాయికగా నటించిన మీరానందన్ మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెట్టారు. యూకేకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ శ్రీజును ఆమె పెళ్లాడారు. శనివారం గురువాయూర్‌లో వీరి వివాహం ఘనంగా జరిగింది. ఆ ఫొటోలను మీరానందన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

ఆశా పాదాలు కడిగిన సోనూ నిగమ్



బాలీవుడ్ చిత్రసీమలో దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న మధుర గాయని ఆశా భోంస్లే. ఆ గానమాధుర్యానికి ఎన్నో పురస్కారాలు వశమయ్యాయి. ఆమె సంగీత ప్రయాణం 'స్వరస్వామిని ఆశ' పేరుతో పుస్తకరూపంలోకి వచ్చింది. ఇటీవలే ముంబైలో జరిగిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆసక్తికర సంఘటన జరిగింది. ప్రముఖ గాయకుడు సోనూ నిగమ్ ఆశా పాదాలను కడిగారు. ఆమె పట్ల తనకున్న ప్రేమ, గౌరవాలను అలా చాటుకున్నారు. 'ఆశాజీ నుంచి చాలా నేర్చుకున్నాను. అందుకే ఆమెకు ఈ విధంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని సోనూ నిగమ్ చెప్పారు.

నవ్య 'దృశ్యం' పేజీలో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/rRRLwqX లో చదవండి.



సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

శ్రీశైలంకు టీడీపీ కార్యకర్తల సైకిల్ యాత్ర

● యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూన్ 29: సార్వత్రిక ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందాలని, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తే మాచర్ల నుంచి శ్రీశైలంకు సైకిల్ యాత్ర చేస్తామని టీడీపీ కార్యకర్తలు కంభంపాటి చంటి, గోపవరపు కేశవ, గాడిపర్తి సాయి మొక్కుకున్నారు. బ్రహ్మానందరెడ్డి 33318 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందడం, కూటమి అధికారంలోకి రావడంతో శనివారం పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి శ్రీశైలంకు వారు సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ యాత్రను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. కార్యకర్తలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి నేతృత్వంలో మాచర్ల నియోజకవర్గంలో అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత పంగులూరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మాచర్ల రూరల్, జూన్ 29: ప్రస్తుతం డయేరియా కేసులు నమోదవుతుడడంతో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మాచర్ల కమ్యూనిటీ వైద్యశాల సూపరింటెండెంట్ ఉదయభాను సూచించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పరిశుభ్రతను పాటించడం ద్వారా డయేరియా ఇతర సీజనల్ వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. ఎప్పటికప్పుడు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. వాంతులు, విరేచనాలతో బాధపడే వారు వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి చికిత్స తీసుకోవాలని డాక్టర్ ఉదయభాను సూచించారు.

పింఛన్‌దారులు అందుబాటులో ఉండాలి

రెంటచింతల, జూన్ 29: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పింఛన్ లబ్ధిదారులు జులై 1న అందుబాటులో ఉండాలని ఎంపీడీవో శంకరరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి పెన్షన్ పంపిణీ చేస్తారన్నారు. మండలంలోని 11 గ్రామాల్లో 7076 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, వారికి ప్రభుత్వ పరంగా రూ.4 కోట్ల 85 లక్షల 58 వేలు పంపిణీ చేస్తారన్నారు. ఒక్కో లబ్ధిదారుడు ఈ నెల మాత్రమే రూ.7 వేలు తీసుకుంటారని మిగతా నెలల్లో రూ.4 వేలు పొందుతారన్నారు.

2న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రెంటచింతల, జూన్ 29: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జులై 2న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకరరావు శనివారం ఒక ప్రకటపలో పేర్కొన్నారు. ఎంపీపీ సంపూర్ణమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, వివిధ శాఖల అధికారులు తప్పని సరిగా రావాలని కోరారు.

పేద ముస్లింలకు భరోసా దుల్హాన్ పథకం

● యరపతినేని నిఖిల్, చదలవాడ ప్రవంత్

దాచేపల్లి, జూన్ 29: దుల్హాన్ పథకం ప్రవేశపెట్టడంతో పేద ముస్లింలకు భరోసా ఇచ్చినట్లయిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు తనయుడు ప్రవంత్‌లు తెలిపారు. శుక్రవారం రాత్రి దాచేపల్లి మండలం కేశానుపల్లి గ్రామంలో టీడీపీ మైనారిటీ నేతలు షేక్ జానయ్య ఇంటివద్ద జరిగిన ఆత్మీయ సమావేశంలో వారు పాల్గొన్నారు. నిఖిల్, ప్రవంత్‌లు మాట్లాడుతూ దుల్హాన్ పథకంతో పాటు ముస్లిం సోదరుల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి పథకాలను చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు నెల్లూరి రామకోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన ర్యాలీ

కారంపూడి, జూన్ 29: మండల కేంద్రమైన కారంపూడిలో శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యాన అతిసార వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో జిల్లా జలజీవన్ మిషన్ మేనేజర్ కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కుమార రాజా, ఏఈ వెంకటేష్, జిల్లా కోఆర్డినేటర్లు, తేజ్, సంగీత్, రమేష్, నవీన్, సుబ్బారావు, మల్లయ్య, లింగయ్య, లాలు, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, కసిన్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

హుస్సేన్‌రెడ్డి మృతి కార్మికులకు తీరనిలోటు

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

దాచేపల్లి, జూన్ 29: మందపాటి హుస్సేన్‌రెడ్డి ఆకస్మిక మృతి కార్మికులకు తీరని లోటని, నిబద్ధత కలిగిన వ్యక్తి అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. శనివారం దాచేపల్లి మండలంలోని ఇరికేపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మందపాటి నాగిరెడ్డి కుమారుడు మందపాటి హుస్సేన్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు షేక్ హుస్సేన్, కృష్ణారెడ్డి, రమణారెడ్డి, సత్యనారాయణ, కొమెర వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ఏఈ ఉద్యోగ విరమణ

దుర్గి, జూన్ 29: పీఆర్ ఏఈ వెలుగొండారెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శనివారం మండల కేంద్రమైన దుర్గి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సునీత సాయిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు వెలుగొండారెడ్డి దంపతులను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుప్త, పంచాయతీ రాజ్ డీఈలు కోటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, ఏవో అమీర్‌రెడ్డి, మండల అభివృద్ధి ఏవో శివప్రసాద్, ఏపీవో వెంకటేశ్వర్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులకు రూ.కోట్లలో కుచ్చు టోపీ

● వ్యాపారిపై గుంటూరు ఎస్పీకి బాధిత రైతుల ఫిర్యాదు

గుంటూరు, జూన్ 29: మిర్చి వ్యాపారి రైతులకు రూ. కోట్లలో కుచ్చుటోపీ పెట్టడంతో బాధిత రైతులు శనివారం తెలుగు మహిళా నాయకురాలు వేగుంట రాణి ఆధ్వర్యంలో గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు చేసారు. బాధిత రైతులు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అచ్చంపేట మండలం గండసిరి, ఓర్వకల్లు తదితర గ్రామాల్లో ఏటుకూరుకు చెందిన మిర్చి వ్యాపారి లక్కిశెట్టి రవికుమార్ రైతుల నుంచి మిర్చి కొనుగోలు చేసారు. వారం పది రోజుల్లో డబ్బులు ఇస్తానని రైతుల ను నమ్మించి మిర్చి కొనుగోలు చేసిన రవికుమార్ వారికి డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడని రైతులు వాపోయారు. కొంత కాలంగా తాము డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తుంటే డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడన్నారు. గట్టిగా అడిగిన రైతులపై రవికుమార్ బెదిరింపులకు దిగుతున్నాడన్నారు. ఇటీవలే డబ్బులు కోసం వచ్చిన తమపై వ్యాపారి దాడి చేయించాడన్నారు. తమకు సుమారు ఐదు కోట్ల వరకు ఇవ్వాల్సి ఉందని బాధిత రైతులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని వారు జిల్లా ఎస్పీని బాధిత రైతులు వేడుకున్నారు.

నేర చరిత్ర కలిగివుంటే రౌడీషీట్..

నకరికల్లు, జూన్ 29 : నేర చరిత్ర కలిగిన వారందరిపై రౌడీ షీట్లు ఓపెన్ చేస్తున్నట్లు నకరికల్లు ఎస్ఐ నాగేంద్రరావు తెలిపారు. శనివారం మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో శాంతి కమిటీ ఏర్పాటు చేసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో అల్లర్లకు పాల్పడిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. సమస్యలు సృష్టించాలని ప్రయత్నిస్తే గ్రామ బహిష్కరణ చేయనున్నట్లు హెచ్చరికలు జారీ చేశారు. బాంబుల దాడి కేసు ఘటనకు సంబంధించి నేర చరిత్రను పరిశీలించి రౌడీషీట్లు తెరిచినట్లు తెలిపారు. ఘర్షణలకు పాల్పడకుండా శాంతియుతంగా జీవించాలని సూచించారు.



రూపెనగుంట్లలో కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ కే నాగేంద్రరావు

ప్రతి వ్యక్తి ప్రశాంత జీవనం గడపాలి

● కేసుల పరిష్కారంలో రాజీయే రాజమార్గం

● గురజాల సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు

● మాచర్ల, సత్తెనపల్లి కోర్టులలోనూ లోక్ అదాలత్

● హాజరైన న్యాయాధికారులు, న్యాయవాదులు, పోలీసులు



లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న గురజాల న్యాయాధికారి వై శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, గురజాల లీగల్, జూన్ 29: ప్రతి వ్యక్తి గొడవలకు దూరంగా ఉండి ప్రశాంత జీవనం గడపాలని గురజాల సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు సూచించారు. శనివారం గురజాల కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ కక్షిదారులు తమ కేసులను లోక్ అదాలత్ ద్వారా రాజీపడటంతో రెండు వైపులవారూ లబ్ధి పొందుతారన్నారు. ఈ అదాలత్‌లో మొత్తం 48 కేసులను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందపాటి శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు ఎస్కే జానీబాష, కే.హరిసత్యనారాయణ, కలివెల ప్రభుదాసు, జే.చెన్నకేశవరావు, వీరభద్రుడు, కుమారస్వామి, రామిరెడ్డి, వెంకటేశ్వర్లు, డీవీ ఆర్కే. మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో.. పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టులో శనివారం న్యాయ అవగాహన సదస్సు, లోక్ అదాలత్ జరిగింది. న్యాయమూర్తి ఎం.మురళీగంగాధరరావు ఉచిత న్యాయసేవా చట్టాల గురించి అవగాహన కల్పించారు. మొత్తం 58 కేసులు లోక్‌అదాలత్‌లో పరిష్కరించారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు అచ్చారావు, న్యాయవాదులు కుమారస్వామి, జాలారావు, చంద్రకళ, లోకేశ్వరి, వెంకటేష్, కోటేశ్వరరావు, పి నవ్య, ఎస్కె మౌలాలి, కె కోటేశ్వరరావు, అయాజ్ అహ్మద్, కె సాగర్‌తో పాటు మరికొందరు పాల్గొన్నారు.

మాచర్లటౌన్: మండల న్యాయసేవా కమిటి ఆధ్వర్యాన శనివారం పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు హాల్లో చైర్మన్ శ్రీనివాస కల్యాణ్ ఆధ్వర్యాన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ అదాలత్‌లో 54 కేసులను పరిష్కరించారు. ఇందులో క్రిమినల్ 38, సివిల్ 8, టెలిఫోన్ బీఎస్ఎన్ఎల్ కేసులు 8 ఉన్నాయి. కార్యక్రమంలో ఏజీపీ జీ. వెంకటేశ్వర్లు, ఏపీపీ రవీంద్ర, న్యాయవాదులు జి సత్యనారాయణరెడ్డి, కెనడి, గంగుల శ్రీనివాసరావు, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, పేర్ల వెంకటేశ్వర్లు, మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు.

సత్తెనపల్లి : పట్టణంలోని నాలుగు కోర్టుల పరిధిలో శనివారం న్యాయ అవగాహన సదస్సు, జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. లోక్ అదాలత్‌లో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి వెంకట నాగ శ్రీనివాసరావు ఉచిత న్యాయ సేవల చట్టాల గురించి, లోక్ అదాలత్ ప్రాముఖ్యత గురించి వివరించారు. లోక్ అదాలత్‌లో మొత్తం 122 కేసులు పరిష్కారమైనట్లు న్యాయాధికారి తెలిపారు. లోక్ అదాలత్‌ను విజయవంతం చేసిన న్యాయవాదులు, కక్షిదారులకు, సంబంధిత పోలీసుస్టేషన్ల అధికారులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. లోక్ అదాలత్‌లో న్యాయాధికారి మహమ్మద్ గౌస్, కౌషిత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

సత్తెనపల్లి, జూన్ 29: పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో మునిసిపల్ అధికారులకు శనివారం సాయంత్రం డీఈ మధుసూదనరావు ఆధ్వర్యంలో డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డయేరియా రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,చ చర్యల గురించి వైద్యులు ధర్మసింగ్ శాస్త్రి, ఆసియా, భాను ప్రకాష్‌లు వివరించారు. ప్రధానంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రక్షిత మంచి నీరు కలుషితం కాకుండా చూడాలని వారు సూచించారు. డయేరియా వస్తే తీసుకోవాల్సిన చర్యల గురించి వారు వివరించారు. సమావేశంలో పలువురు మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూముల కొనుగోలులో అవకతవకలు

సత్తెనపల్లి, జూన్ 29: జగనన్న కాలనీల కోసం సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో కొనుగోలు చేసిన భూముల విషయంలో అవకతవకలు జరిగాయని, దీనిపై విచారణ జరిపి కారకులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దివ్వెల శ్రీనివాసరావు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగనన్న కాలనీల ఏర్పాటుకోసం రైతులవద్ద నుంచి తక్కువ మొత్తానికి భూములు కొనుగోలు చేసి మాజీ మంత్రి అంబటి రాంబాబు అనుచరులు భారీ అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. జగనన్న కాలనీల ఏర్పాటులో జరిగిన భూముల కొనుగోలు కుంభకోణం, సిమెంట్, ఇసుక, ఇనుము దారి మళ్లింపు విషయాలపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నామినేటెడ్ పోస్టుల్లో

కాపులకు ప్రాధాన్యమివ్వాలి

నకరికల్లు, జూన్ 29: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటానికి కీలక భూమిక పోషించిన కాపు సామాజిక వర్గానికి టీడీపీ పార్టీ పదవుల్లోను, నామినేటెడ్ పదవుల్లోను తగిన ప్రాధాన్యత కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఐక్యకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు బేతు రామ్మోహనరావు కోరారు. రామ్మోహనరావు శనివారం టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలసి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి విజయంలో కాపులు కీలకంగా వ్యవహరించారన్న విషయాన్ని టీడీపీ అధ్యక్షుడు పల్లాకు వివరించి, త్వరలో నియమించబోయే పదవుల్లో కాపులకు సముచిత స్థానం కల్పించాలని కోరినట్లు రామ్మోహనరావు తెలిపారు.



పాదయాత్ర నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

దేరంపాడుకు టీడీపీ నేతల పాదయాత్ర

బెల్లంకొండ, జూన్ 29 : కూటమి అధికారంలోకి వచ్చి సీఎంగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేస్తే బెల్లంకొండ నుంచి రాజుపాలెం మండలం దేవరంపాడు నేతి వెంకన్నస్వామి ఆలయం వద్దకు పాదయాత్ర చేస్తామని బెల్లంకొండ టీడీపీ నేతలు ఎన్నికలకు ముందు మొక్కుకున్నారు. ఆ మొక్కు తీర్చుకోవడంలో భాగంగా టీడీపీ నేతలు శనివారం ఉదయం మండల కేంద్రమైన బెల్లంకొండ లక్ష్మీతిరుపతమ్మ, గంగమ్మ, అంకమ్మ, పోలేరమ్మ తల్లుల ఆలయం వద్ద నుంచి కొబ్బరికాయలు కొట్టి పాదయాత్ర చేపట్టారు. ముందుగా టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ పాదయాత్రను ప్రారంభించారు. నాగిరెడ్డిపాలెంలో చేరుకోగానే వెన్నా సీతారామిరెడ్డి పాదయాత్రలోని వారిని దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న కోళ్ళూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి నడుచుకుంటూ దేవరంపాడు నేతి వెంకన్నస్వామి ఆలయం వద్దకు చేరుకొని పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో జవ్వాజి పాపయ్య, బాలాజీ నాయక్, శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, వైస్ సర్పంచ్ సుభానీ, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, ఎన్ పిచ్చయ్య, పీఎస్‌కే రసూల్, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, తెలుగుదేశం అధ్యక్షుడు సలాం, కొండవీటి అహమ్మద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇబ్రహీం, చిట్టి, ముస్తఫా, తెల్లమేకల నాగేశ్వరరావు, మల్లి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా శ్రీను

రెంటచింతల,జూన్ 29 : మండల కేంద్రమైన రెంటచింతలలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా కే.శ్రీనును నియమిస్తూ బ్యాంకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి దాకా ఇక్కడ పని చేసిన విశాల్‌ను హైదరాబాద్‌కు బదిలీ చేశారు. అచ్చంపేట నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చిన శ్రీను విలేకరులతో మాట్లాడుతూ వ్యక్తిగత, పంట రుణాలు పొందాలనుకునే వారికి బ్యాంకు నిబంధనల మేరకు సహకరిస్తామని, సంప్రదించాలని సూచించారు.

బడి ఈడు పిల్లలు పాఠశాలలో ఉండాలి

అచ్చంపేట, జూన్ 29 : బడి ఈడు గల పిల్లలు తప్పనిసరిగా పాఠశాలలోనే ఉండాలని తాడువాయిలోని ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం కే.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం తాడువాయిలోని యూపీ పాఠశాలకు చెందిన 115 మంది బాల బాలికలతో ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు గల పిల్లందరూ బడిలోనే ఉండాలని, పనులకు వెళ్లరాదని ర్యాలీలో విద్యార్థులు నినదించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఐ శ్రీనివాసరావుకు ప్రశంసాపత్రం

కారంపూడి, జూన్ 29: మండలంలోని ఒప్పిచర్లలో విజయలక్ష్మి హత్య కేసు నిందితులను అరెస్ట్ చేసిన సీఐ అలహరి శ్రీనివాస్‌ను శనివారం ఎస్పీ మలికా గార్గ్ అభినందించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావుకు ప్రశంసాపత్రం అందించారు.

నేడు తుమ్మకోటకు ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

రెంటచింతల,జూన్ 29 : ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి నేడు మండలంలోని తుమ్మకోట గ్రామంలో పర్యటించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షులు చపారపు అబ్బిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన అనంతరం తొలిసారి తుమ్మకోటకు వస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు కూటమి నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఏడు రోజుల నుంచి నిర్వహిస్తున్న గ్రామ దేవతైన ఇంద్రాణి ముత్యాలమ్మ జాతరలో పాల్గొని పూజలు నిర్వహిస్తారని తెలిపారు.

నేడు భట్లూరులో ఉచిత వైద్యశిబిరం

సత్తెనపల్లి రూరల్, జూన్ 29 : ఆలోకం వెంకాయమ్మ సంస్మరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని భట్లూరులో ఈనెల 30వ తేదీ ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. శిబిరానికి అతిథులుగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలతోపాటు ప్రముఖులు హాజరవుతారన్నారు. శిబిరంలో రోగులకు ఉచిత పరీక్షలునిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించటం జరుగుతుందన్నారు. గ్రామ, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.



అప్పలనరసమ్మను సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న ఉద్యోగులు

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

● జెన్‌కో ఈఈ వైఎస్ఆర్‌కే ప్రసాద్

● ఉద్యోగ విరమణ పొందిన అప్పల నరసమ్మకు సత్కారం

మాచర్ల రూరల్, జూన్ 29: ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు ఉంటుందని ఏపీ జెన్‌కో ఈఈ వైఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. నాగార్జున సాగర్ కుడి జలవిద్యుత్ కేంద్రంలో ప్లాంట్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన అప్పల నరసమ్మ సన్మాన కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. అప్పల నరసమ్మ విధినిర్వహణలో ఎంతో అంకితభావం, క్రమ శిక్షణ, నిబద్ధతతో పనిచేశారని, ఆమె సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. అనంతరం ఉద్యోగులు అప్పల నరసమ్మను సన్మా నించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డీఈ రాజారెడ్డి, ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ రీజనల్ ప్రెసిడెంట్ సాంబశివ, సూరజ్ చందు తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేద్దాం

● సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ శివయాదవ్

మాచవరం, జూన్ 29: గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాచవరం మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిగా వించుకునేందుకు కృషి చేద్దామని జడ్పీటీసీ శివయాదవ్ ఆకాంక్షించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దారం అమ్ములమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శివయాదవ్ మాట్లాడుతూ రానున్న ఐదేళ్ల కాలంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సహకారంతో మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుందాని అన్నారు. తొలుత వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు వారి శాఖ సంబంధిత సమాచారాన్ని సభలో సభ్యులకు తెలియజేశారు. సమావేశానికి కొందరు అధికారులు హాజరుకాలేదని, రానున్న సమావేశానికి అధికారులు అందరూ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సురేష్‌కు సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్‌లో వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, పంచాయతీ, ఆరోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అందరూ సంయుక్తంగా పనిచేసి గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో సురేష్ సూచించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలకు నిధులు విడుదల చేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. గ్రామాలలో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు అందరూ కలిసి గ్రామాల అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఈవోఆర్డీ వెంగళరావు, ఏఈలు వెంకటేశ్వరరెడ్డి, సురేష్, పెదమస్తాన్, వైద్యాధికారులు ప్రసాద్, అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ శివయాదవ్ తదితరులు



సబ్‌జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారులు

నాణ్యమైన భోజనం అందించాలి

● సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు

సత్తెనపల్లిరూరల్, జూన్29 : విద్యార్థినిలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ సీహెచ్ వెంకటనాగశ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం వద్దగల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. వంటసాల,పాఠశాల పరిసరాలను పరిశీలించారు. భోజనాన్ని స్వయంగా రుచి చూశారు. విద్యార్థులకు అందించే మెనులో నాణ్యతను తప్పక పాటించాలని ప్రిన్సిపాల్ శైలజతో పాటు వంట సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కౌషిద్ హుస్సేన్, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్‌లు ఉన్నారు.

సబ్ జైలును న్యాయాధికారుల తనిఖీ

సత్తెనపలి: పట్టణంలోని సబ్ జైలును న్యాయాధికారులు సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు, మహమ్మద్ గౌస్, న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావులు శనివారం "నిఖీ చేశారు. సబ్ జైలులోని ఆహార పదార్థాలను పరిశీలించారు. సబ్ జైలులోని బ్యారక్‌లను, ఆహార పదార్థాల స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఖైదీలకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

పింఛన్‌ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

● రేపు ఉదయం ఆరు గంటల నుంచి పంపిణీ

● కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్

నరసరావుపేట, జూన్ 29 : జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ శ్రీకేశ్ బాలాజీ లత్కర్ శనివారం తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి లబ్ధిదారులకు ఇంటికి వెళ్లి పింఛన్ అందించనున్నట్లు చెప్పారు. సచివాలయాల్లో సచివాలయ ప్రభుత్వ శాఖల ఉద్యోగుల సేవలను పింఛన్ల పంపిణీ కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామ, వార్డ్ సచివాలయ సిబ్బంది సేవలను వినియోగిస్తుమని, అదనపు సిబ్బందిగా వివిధ శాఖలలోని జూనియర్ అసిస్టెంట్, సిబ్బంది సేవలు తీసుకుంటామన్నారు. ఇందుకు సంబంధించిన యంత్ర పరికరాలను సిబ్బందికి అందించామన్నారు. అదనపు సిబ్బందికి బయోమెట్రిక్ యంత్రపరికరం వినియోగంపై శిక్షణ అందించినట్లు తెలిపారు. గిరిజన మండలాల్లో పెన్షన్ల పంపిణీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేతన్నలు, మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, డప్పు కళాకారులు, హెచ్ఐవీ బాధితులు, హిజ్రా లకు రూ.3 వేల నుంచి రూ.4వేలు ఇవ్వనున్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలది కలిపి రూ.7వేలు పంపిణీ చేయనున్నారు. దివ్యాంగులకు అందించే సాయాన్ని రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచారు. వీరికి రూ.15 వేలు అందించనున్నారు. కిడ్నీ, కాలేయం. గుండె మార్పిడి చేసుకున్నవారికి రూ. 5 వేలు నుంచి రూ.10 వేలు ఇవ్వనున్నారు. మంచానికే పరిమితమైనవారికి రూ.5 వేల నుంచి రూ.15 వేలు ఇవ్వనున్నారు.

అధినేతల చిత్రపటాలకు క్షీరాభిషేకం

● పెంపుదల పింఛన్ పంపిణీపై హర్షం

సత్తెనపల్లి, జూన్ 29 : ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పెంచి జూలై 1 నుంచి పంపిణీ చేయనున్న నేపథ్యంలో శనివారం 24వ వార్డులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు టీడీపీ నేతలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నూర్‌బాషా జానీబాబు, లోకేశ్వరరావు, జానీబాషా, జవ్వాజి రామ్మోహన్‌రావు,పోతుగంటి నరశింహారావు, రామకోటేశ్వరరావు, దేవతి శివప్రసాద్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు కొమ్మాలపాటి పరామర్శ

క్రోసూరు, జూన్ 29 : క్రోసూరు మండలం బాలెమర్రు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత బొబ్బా వెంకటేశ్వర్లు అశ్వస్థతకు గురై గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ శనివారం ఆస్పత్రికి వెళ్ళి పరామర్శించారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. బొబ్బా వెంకటేశ్వర్లుకు పార్టీ అండగా ఉంటుందని కొమ్మాలపాటి భరోసా ఇచ్చారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఆరు నెలలుగా జీతాలు ఇవ్వలేదు..

● ఫస్ట్ ఆబ్జక్టీవ్ కాంట్రాక్ట్ సంస్థపై చర్యలు తీసుకోవాలని కార్మికుల వినతి

సత్తెనపల్లి, జూన్ 29 : ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకుండా పారిశుధ్య కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్న ఫస్ట్ ఆబ్జక్టీవ్ కాంట్రాక్ట్ సంస్థపై చర్యలు తీసుకొని తమకు వెంటనే జీతాలు ఇప్పించాలని కోరుతూ దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య కార్మికులు ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ లక్ష్మణరావుకు వినతి పత్రం అందించారు. నెల నెలా రూ.16వేలు జీతం చెల్లించాల్సి ఉండగా రూ.11వేలు మాత్రమే ఇస్తున్నారని, మిగతా రూ.5వేలు పీఎఫ్ పేరుతో కాజేస్తున్నారని సూపరింటెండెంట్‌కు తెలిపారు. పీఎఫ్ ఖాతా లెక్కల వివరాలు సరిగా చెప్పటం లేదని వాపోయారు. వీటిపై విచారణజరిపి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సూపరింటెండెంట్ లక్ష్మణరావు స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళి పరిష్కరించేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, రామకృష్ణ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి పుష్పగుచ్ఛాలనందచేస్తున్న తహశీల్దార్ రామమోహనరావు

ప్రభుత్వ ప్రతిష్టను పెంచాలి

● రెవెన్యూ ఉద్యోగులతో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల,జూన్ 29: రెవెన్యూ ఉద్యోగులు ప్రభుత్వ ప్రతిష్టను పెంచడానికి కృషి చేయాలని కార్యనిర్వాహక శాఖలో రెవెన్యూ అత్యంత ముఖ్యమైందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి తహశీల్దార్ రామమోహనరావుతో పాటు రెవెన్యూ ఉద్యోగులంతా వెల్దుర్తి వెళ్లి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయంలో రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేసి ఇష్టారాజ్యంగా వ్యవహరించి ప్రభుత్వ భూములను బినామీల పేరున రాయించుకున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు నేతృత్వంలో అటువంటి ఆగడాలకు అవకాశమే లేదని పేర్కొంటూ వివిధ పనులు నిమిత్తం వచ్చే వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డీటీ బ్రహ్మయ్య, వీఆర్వోలు పల్లా రామకృష్ణ, మల్లికార్జునరెడ్డి, బాలయ్య, లింగయ్య, పాపారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

పిడుగురాళ్ల, జూన్29: గ్రామ స్థాయిలో 1వ తేదీ నుంచి అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు అందజేయనున్నట్లు పిడుగురాళ్ల ఎంపీడీవో సుబ్బారావు తెలిపారు. శనివారం ఎంపీపీ అల్లు సత్యవతి అధ్యక్షతన మండల పరిషత్ సమా వేశం నిర్వహించారు. విద్యాశాఖ, వ్యవసాయశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తమశాఖల ప్రగతిని చదివి వినిపించారు. ఎంపీపీ సత్యవతి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా చూడాలన్నారు. ఎంపీడీవో సుబ్బారావు మాట్లాడుతూ గురజాల శాసనసభ్యులుగా ఎన్నికైన యరపతినేని శ్రీనివాసరావుకు మండల పరిషత్ తరుపున అభినందనలు తెలిపే తీర్మానం చేశారు. సమావేశంలో ఉప ఎంపీపీ సాతులూరి బాబు, ఎంపీటీసీ గార్లపాటి అనసూయ, డిప్యూటీతహసీల్దార్ సరోజ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు

పల్నాడు వార్తలు

నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్

నరసరావుపేట, జూన్ 29: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ శ్రీకేశ్ బాలాజీ లత్కర్ శనివారం తెలిపారు. సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి లబ్ధిదారులకు ఇంటికి వెళ్లి పింఛన్ అందించనున్నట్లు చెప్పారు. సచివాలయ, ప్రభుత్వశాఖల ఉద్యోగులను పింఛన్ల పంపిణీ కోసం సేవలను వినియోగించనున్నట్లు తెలిపారు. అదనపు సిబ్బందిగా వివిధ శాఖలలోని జూనియర్ అసిస్టెంట్, తదితర సిబ్బంది సేవలు వినియోగిస్తున్నామన్నారు. అదనపు సిబ్బందికి బయోమెట్రిక్ వినియోగంపై శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. గిరిజన మండలాల్లో పెన్షన్ల పంపిణీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేతన్నలు, మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, డప్పు కళాకారులు, హెచ్ఐవీ బాధితులు, హిజ్రాలకు రూ.3 వేల నుంచి రూ.4 వేలు ఇవ్వనున్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలది కలిపి రూ.7 వేలు పంపిణీ చేయనున్నారు. దివ్యాంగులకు అందించే సాయాన్ని రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచారు. వీరికి రూ.15 వేలు అందించనున్నారు. కిడ్నీ, కాలేయం. గుండె మార్పిడి చేసుకున్నవారికి రూ.5 నుంచి రూ.10 వేలు.. మంచానికే పరిమితమైనవారికి రూ.5 వేల నుంచి రూ.15 వేలు ఇవ్వనున్నారు.

డయేరియా నివారణపై గోడపత్రిక ఆవిష్కరణ

నరసరావుపేట లీగల్, జూన్ 29: స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టర్ లత్కర్ ఆధ్వర్యంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ రవి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా వైద్యశాలలో జూలై 1 నుంచి స్టాప్ డయేరియా క్యాంపెయిన్ 2024 నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమం జూలై 1న ప్రారంభమై ఆగస్టు 31వరకు జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రజలందరూ కార్యక్రమంలో పాల్గొని తమ సిబ్బంది ఇచ్చే సూచనలు పాటించాలని కోరారు.

ఆదర్శ పట్టణంగా తీర్చి దిద్దడమే లక్ష్యం

- రూ.161 కోట్లతో శాశ్వత తాగునీటి పథకాన్ని పూర్తి చేస్తాం
- 146 జీవో ప్రకారం ఎన్ఎస్పీ స్థలంలో అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, జూన్ 29: వినుకొండను ఆదర్శ పట్టణంగా తీర్చి దిద్దడమే నాలక్ష్యం. రూ.161 కోట్లతో శాశ్వత తాగునీటి పథకాన్ని పూర్తి చేయడంతో పాటు. 146 జీవో ప్రకారం ఎన్ఎస్పీ స్థలంలో అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ మున్సిపాలిటీ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సమావేశానికి మొట్టమొదటి సారిగా హాజరైన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పుష్పగుచ్ఛాలతో మున్సిపల్ ముఖద్వారం నుంచి రెడ్‌కార్పెట్ వేసి, మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మొత్తం 29 అంశాలను సభలో కౌన్సిలర్లు ఆమోదించారు. ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో ఎన్ఎస్పీ కాలనీ ఆవరణలో కమర్షల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టుటకు వీలుపడక పోవ డంతో బహిరంగ వేలం నందు పాల్గొన్న 52 మంది పాటదారుల డిపాజిట్ వాపస్ చేయుటకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వైసీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే వద్దకు వచ్చి వార్డులో సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించాలని మొరపెట్టుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం శాశ్వత మంచినీటి పథకానికి కేవలం 30శాతం మ్యాచింగ్ గ్రాంట్ చెల్లించ క పోవడంతో, పథకం పనులు పూర్తి చేయలేక పోయారని, కోట్ల రూపాయల విలువ చేసే 22 ఎకరాల ఎన్ఎస్పీ కాలనీ స్థలాన్ని మున్సిపాలిటికి కేటాయిస్తే, ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి చేయకుండా, అసత్య ప్రచారాలతో ప్రజలను మోసం చేశారన్నారు. ప్రజలు తమపై నమ్మకంతో మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కృష్ణవేణి, డీఈఈ వెంకయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులతో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.


సాధారణ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

టీడీపీ శ్రేణులపై వైసీపీ నేతల దాడి దుర్మార్గం

- ఫ్యాక్షన్ ప్రేరేపిస్తే చూస్తూ ఊరుకోం
- ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూన్ 29 : టీడీపీ శ్రేణులపై వైసీపీ నేతల దాడి దుర్మార్గమని, నియోజకవర్గంలో ఫ్యాక్షన్‌ను ప్రేరేపిస్తే చూస్తూ ఊరుకోమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం రొంపిచర్ల మండలం మునమాకకు చెందిన మాజీ ఎంపీటీసీ కుంపటి రవిపై వైసీపీ నాయకులు దాడి పాల్పడగా అపస్మారక స్థితిలో ఉన్న రవిని నరరావుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న కుంపటి రవిని ఆయన పరామర్శించారు ఈ సందర్భంగా అరవిందబాబు మాట్లాడుతూ వైసీపీ నేతలు పద్ధతి మార్చుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో హింసాత్మక ఘటనలకు తావివ్వబోమని, విషయం పోలీసుల దృష్టికి తీసుకెళ్లి, నిందితులను అరెస్టు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.


కుంపటి రవిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

ఆర్టీసీ బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీ

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిందిపోయి కనీసం పట్టించుకోకపోతే ఎలాగని ప్రశ్నించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు, బురద, బస్టాండ్ ఆవరణలో నిలిచిపోవడంతో దుర్వాసన కారణంగా ప్రయాణికులు అవస్థలు పడుతుంటే ఏమి చేస్తున్నారన్నారు. ఇప్పటికే నాలుగసార్లు బస్టాండ్ పరిశీలించామని అయినా పరిస్థితులు మారకపోతే ఎలాగని అన్నారు. ఈ మేరకు బస్టాండ్ ఆవరణలోని పూడుకుపోయిన కాలువను ఎమ్మెల్యే శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం, డీఎం తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్ ఐజీ త్రిపాఠిని కలిసిన చదలవాడ

గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాటిని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు శనివారం కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో నరసరావుపేట జిల్లా అగ్రస్థానంలో ఉందన్నారు. గతంలో ప్రశ్నిస్తే కేసు, నిలదీస్తే దాడి, ఎదిరిస్తే హత్య అనే పరిస్థితి నెలకొందన్నారు. నియోజకవర్గంలో ఇకపై శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్కరిని ఉపేక్షించవద్దని కోరారు, ప్రజా సమస్యలపై, రాజ్యాంగం పరిరక్షణ కోసం అనునిత్యం పోలీస్‌లకు అండగా ఉంటామన్నారు.

మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది

- కమిషనర్ గోవిందరావు

చిలకలూరిపేట, జూన్ 29 : చిలకలూరిపేట మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని కమిషనర్ సీహెచ్ గోవింద రావు శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వెల్లడించారు. సమావేశానికి చైర్మన్ షేక్ రఫానీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టర్లకు రూ.9 కోట్ల బకాయి ఉన్నదని వెల్లడించారు. బకాయిల కారణం గా అభివృద్ధి పనులు చేయటానికి కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదన్నారు. మంచి నీటి చెరువులను నింపటానికి కాం ట్రాక్టర్లను బతిమలాడుకొనే పరిస్థితి ఏర్పడిందని వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష టీడీపీ కౌన్సిలర్ల గ్రూపు నాయకుడు గంగా శ్రీనివాసరావు, వైసీపీకి చెందిన 10వ వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి తదితరులు మాట్లాడుతూ ఐదు సంవత్సరా లుగా మున్సిపాలిటీకి నిధులు మంజూరు కాకపోవటంపై ఆం దోళన వ్యక్తం చేశారు. నిధుల కొరత కారణంగా అభివృద్ధి పనులు స్తంభించి పోయాయని అన్నారు. ప్రతిపక్ష నేత గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వార్డుల్లో చిన్న చిన్న పనులు కూడా చేయ లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కాగా ఎన్నికల్లో గెలుపొందిన ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావులతో పాటు చంద్రబాబునాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతూ సభలో అభినందనలు తెలిపారు. ఎజెండాలోని మొత్తం 54 అంశాలను ఆమోదిస్తూ తీర్మానించారు. వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా బొగ్గరం హైస్కూల్ 60వ వార్షికోత్సవం

బొగ్గరం(ఈపూరు), జూన్ 29: మండలంలోని బొగ్గరం హైస్కూల్ 60వ వార్షికోత్సవం శనివారం పాఠశాల పూర్వవిద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధి కోసం పూర్వవిద్యార్థులు కమిటీగా(బాస్) ఏర్పడ్డారు. దాని ద్వారా పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జీవీ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం ఎలాగైతే పాటుపడుతున్నారో.. గ్రామాభివృద్ధికి కూడా తమవంతు కృషి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను, ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోట్లూరి హైమావతి, గ్రామస్థులు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

బాలికపై తండ్రి అత్యాచార యత్నం.. స్పందించని పోలీసులు

నరసరావుపేట లీగల్, జూన్ 29: ఓ తొమ్మిది సంవత్సరాల బాలికపై తండ్రి అత్యాచార యత్నానికి ఒడిగట్టిన ఘటన పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ తొమ్మిది సంవత్సరాల బాలికపై ఆమె తండ్రి నాలుగు రోజుల క్రితం అత్యాచార యత్నానికి ఒడిగట్టాడు. భయపడి పోయిన బాలిక సమీపంలో నివశిస్తున్న ఆమె అమ్మమ్మ ఇంటికి వెళ్ళింది. కాగా బాలిక తల్లి మృతి చెందిందని, ఏ విధమైన కేసు నమోదు కాలేదని, నిందితుడు మరలా ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడని బాధితురాలు బంధువులు తెలిపారు. నాలుగు రోజుల క్రితమే సదరు బాలిక ఈ విషయాన్ని రెండో పట్టణ పోలీసుల దృష్టికి తీసుకువెళ్లగా వారు ఏ విధమైన చర్యలు తీసుకోలేదు. శనివారం బాధితులు మీడియా దృష్టికి తేవటంతో వారు ప్రశ్నించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయంలో సామగ్రి చోరీ

శానంపూడి(శావల్యాపురం), జూన్ 29: మండలంలోని శానంపూడి గ్రామ సచివాలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి విలువైన సామగ్రిని అపహరించారు. సచివాలయ సిబ్బంది శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకొని మెయిన్ డోర్‌కు తాళాలు వేసి వెళ్లిపోయారు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లి వైద్య, ఆరోగ్యశాఖకు సంబంధించిన కంప్యూటర్, కీబోర్డు, యూపీఎస్ మౌస్, పశువైద్యశాఖవారు మందులు భద్రపరచుకొనే ఫ్రిజ్‌లను అపహరించారు. ఆనవాళ్ళు దొరక్కుండా ఉండేలా మెయిన్ డోర్‌కు పగులగొట్టిన తాళాన్ని కూడా వారితో తీసుకెళ్లారు. శనివారం ఉదయాన్నే సచివాలయ సిబ్బంది విధులకు హాజరయ్యేందుకు సచివాలయానికి రాగా మెయిన్ డోర్‌కు తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి తలుపులు తెరిచి లోపలికి వెళ్లి చూడగా కంప్యూటర్, ఫ్రిజ్ తదితర సామగ్రి కనిపించకపోవడంతో పంచాయతీ కార్యదర్శి ముంద్రు మనోహర్‌కు తెలియజేశారు. ఆయన వెంటనే సచివాలయం వద్దకు వచ్చి విషయాన్ని ఎంపీడీవో కవితాచౌదరికి తెలియజేసి అనంతరం శావల్యాపురం పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎస్ఐ చల్లా సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. సచివాయం గ్రామానికి వెలుపల ఉండడం, రాత్రివేళల్లో వాచ్‌మన్‌ను కూడా నియమించకపోవడంతో భద్రత కరువైందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

చిలకలూరిపేట, జూన్ 29 : నాలుగు రోజుల క్రితం మేడా సాయి భవానీ(20) అనే యువతిని హత్య చేసిన కేసులో ఆమె రెండో భర్త దుర్గి గ్రామానికి చెందిన కనపర్తి సురేష్ (23) అనే యువకుడిని చిలకలూరిపేట రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. మొదటి భర్తతో మాట్లాడుతుందన్న అనుమానంతో కక్షపెంచుకొని భవానీని హత్య చేసినట్టు పోలీసులు చెప్పారు.

దొంగతనాలు, దోపిడీ కేసుల్లో ముగ్గురి అరెస్టు

చిలకలూరిపేట, జూన్ 29 : దుర్వ్యసనాలకు బానిసలై నగదుకోసం దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్న చిలకలూరిపేట పట్టణానికి చెందిన ముగ్గురు యువకులను చిలకలూరిపేట రూరల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. చోరీ సొత్తుతో విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన వారిపై పలు కేసులు ఉన్నాయి. చిలకలూరిపేట రూరల్, పట్టణ, నాదెండ్ల, బల్లికురవ, తెలంగాణాలోని వాడపల్లి పరిధిలో వారు పలు దోపిడీలు, దొంగతనాలకు పాల్పడ్డారు. రూరల్ పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి వారిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో జూపూడి రాజేష్, షేక్ అబ్దుల్ బాషా, పాలడుగు నాగేశ్వరరావులు ఉన్నారు. వారి నుంచి రూ 20వేలు విలువ చేసే ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఏటీఎం కార్డు చోరీ చేసి నగదు డ్రా

యడ్లపాడు, జూన్ 29 : మండలంలోని యడ్లపాడులో ఏటీఎం కార్డును చోరీ చేసి రూ. 40వేలు డ్రా చేసిన ఘటనపై పోలీసులకు శనివారం ఫిర్యాదు అందింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న కారుచోల సత్యనారాయణ గురువారం గ్రామంలోని యూనియన్ బ్యాంకులో ఉన్న ఏటీఎం సెంటర్‌కు వెళ్లి రూ.15వేలు తీశాడు. ఆ సమయంలోనే పక్కన ఉన్న గుర్తు తెలియని వ్యక్తి అతని పిన్ నంబర్‌ను గుర్తించారు. ముందు డబ్బులు లెక్క పెట్టుకోండి అని చెప్పి ఏటీఎం మిషన్‌లో ఉన్న కార్డును తీసి మరో కార్డును సత్యనారాయణకు ఇచ్చాడు. ఇంటికి వెళ్లిన సత్యనారాయణ మరో రూ.15వేలు డ్రా అయిన విషయాన్ని ఒక గంటలో గుర్తించాడు. శుక్రవారం కూడా పసుమర్రు గ్రామంలోని ఏటీఎంలో ఆ కార్డుతో గుర్తు తెలియని వ్యక్తి మరో 25వేలు డ్రా చేశాడు. మొత్తం మీద రూ.40వేలు డ్రా చేయటంతో ఎకౌంట్‌ను బ్లాక్ చేయించాడు. ఈవిషయ మై పోలీసు స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు.

వినుకొండ టూ నర్సరావుపేట ఆర్టీసీ బస్సు ప్రారంభం

వినుకొండ, జూన్ 29: వినుకొండ ఆర్టీసీ డిపో నుండీ నర్సరావుపేటకు నూతనంగా ఏర్పాటు చేసిన కొత్త బస్సును ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శనివారం ప్రారంభించారు. ఆర్టీసీ బస్సులో సురక్షితంగా ప్రయాణం చేయొచ్చని, త్వరలో ప్రదాన రహదారులను ఏర్పాటు చేస్తామని, గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ చార్జీలు పెంచారని, పెరిగిన చార్జీలకనుగుణంగా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో గత పాలకులు విఫలమైయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ కోటేశ్వరరావు నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకం దరఖాస్తుల ఆహ్వానం

ఈపూరు, జూన్ 29: పండ్ల తోటల సాగు చేసుకోవాలనుకునే రైతులు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేసుకునేందుకు ధరఖాస్తు చేసుకోవాలని ఏపీవో లక్ష్మణరావు అన్నారు. చిన్న, సన్నకారు రైతులు(5ఎకరాల లోపు) అయి ఉండాలి. పొలం పట్టాదారు పుస్తకం, 1బీ అడంగల్ ఉండాలి. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, తెల్లరేషన్ కార్డు ఉండాలన్నారు. అదే విధంగా పండ్ల తోటలు సాగు చేసే పొలానికి నీటి వసతి ఉండాలన్నారు. మూడేళ్ల కాలపరిమితి కలిగిన మామిడి, బత్తాయి, మునగ, మల్లె, గులాబీ, సపోటా, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్ తదితర పూల పండ్ల మొక్కలను సాగుచేసుకోవచ్చునని అన్నారు.